# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 09-04-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

❖ భారత్ అభివృద్ధి చెందిన దేశంగా అవతరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని భారతీయ జనతా పార్టీ నేత, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

❖ శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది పండుగను ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా జరుపుకుంటున్నారు.

❖ రాష్ట్రానికి ఎన్నికల పోలీసు పర్యవేక్షకులను కేటాయిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది.

❖ రాగల 48 గంటల్లో మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ అభివృద్ధి చెందిన దేశంగా అవతరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని భారతీయ జనతా పార్టీ నేత, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఉత్తరప్రదేశ్ లోని పీలీభీత్‌లో బీజేపీ ఈ రోజు నిర్వహించిన బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కరోనా సమయంలో ప్రపంచానికే ఔషధ సాయం చేసే స్థాయికి భారత్ ఎదిగిందని చెప్పారు. సార్వత్రిక ఎన్నికల నేపధ్యంలో ప్రతీ ఒక్కరు ఓటు బలంతోనే ఎటువంటి క్లిష్ట సమస్య నైనా అధిగమించ వచ్చని పేర్కొన్నారు. దేశం అభివృద్ధి చెందినప్పుడే ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొంటూ…

(వాయిస్ 40 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది ఆస్థానం ఈరోజు శాస్త్రోక్తంగా జరిగింది. శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారికి, విష్వక్సేనుల వారికి విశేష సమర్పణ చేశారు. విమాన ప్రాకారం, ధ్వజస్తంభం చుట్టూ ఊరేగింపు నిర్వహించారు. శ్రీవారి మూలవిరాట్, ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలను ధరింపచేశారు. అనంతరం పంచాగ శ్రవణం నిర్వహించారు. శ్రీశైలంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పంచాంగ శ్రవణం నిర్వహించారు. చిత్తూరు జిల్లా కాణిపాకం వరసిద్ధి వినాయకుని ఆలయంలో ఉగాది

సంబరాలు చేపట్టారు. ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అలాగే ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. విజయనగరం జిల్లా మన్నార్ రాజగోపాలస్వామి ఆలయంలో శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది వేడుకలు సంప్రదాయబద్ధంగా జరిగాయి. సంయుక్త కలెక్టర్ కె.కార్తీక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా రాష్ట్రానికి ఎన్నికల పోలీసు పర్యవేక్షకులను కేటాయిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. అరకు పార్లమెంటరీ నియోజకవర్గంతో పాటు ఆ నియోజకవర్గం పరిధిలోని పాలకొండ, కురుపాం, పార్వతీపురం, సాలూరు, అరకు వేలీ, పాడేరు, రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గాల పర్యవేక్షుడిగా నాగాలాండ్ కేడర్ కు చెందిన ఐపీఎస్ అధికారి నలీమ్ ముస్తఫాను ఈసీ నియమించింది. శ్రీకాకుళం, విజయనగరం పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలోని ఇచ్చాపురం, పలాస, పాతపట్నం, టెక్కలి, ఆముదాల వలస, ఎచ్చెర్ల, నరసన్నపేట, రాజాం, బొబ్బిలి, చీపురుపల్లి, గజపతి నగరం, నెల్లిమర్ల, విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గాలకు పోలీసు పర్యవేక్షకునిగా యూపీ కేడర్‌కు చెందిన సచీంద్ర పటేల్‌ను నియమించింది. విశాఖ, అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గాలకు యూపీ కేడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి అమిత్ కుమార్‌ను నియమించింది. ఆ పార్లమెంటు నియోజకవర్గాల్లోని శృంగవరపు కోట, భీమిలి, విశాఖ తూర్పు, దక్షిణం, ఉత్తరం, విశాఖ పశ్చిమ నియోజకవర్గాలతో పాటు గాజువాక, చోడవరం, మాడుగుల, అనకాపల్లి, పెందుర్తి, ఎలమంచిలి, పాయకరావు పేట, నర్సీపట్నం నియోజకవర్గాలను ఆయన పర్యవేక్షించనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తర కోస్తా నుండి దక్షిణ తమిళనాడు వరకు ఏర్పడిన ద్రోణి ప్రభావంతో రానున్న 48 గంటల్లో మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. అలాగే గరిష్ట ఉష్ణోగ్రతలు 2 - 3 డిగ్రీలకు తగ్గే అవకాశం ఉందని తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉగాది సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దంపతులకు పండితులు వేద ఆశీర్వచనం పలికారు. అనంతరం పండితులు అందించిన ఉగాది పచ్చడిని ముఖ్యమంత్రి దంపతులు స్వీకరించారు. పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం గంటావారిపాలెం వద్ద "మేమంతా సిద్ధం" బస్సు యాత్ర క్యాంపులో ఈ కార్యక్రమం జరిగింది. నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్, వైసీపీ నేతలు బొల్లా బ్రహ్మనాయుడు, లేళ్ల అప్పిరెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో పలు మండలాల్లో తీవ్రవడగాల్పులు వీచే అవకాశం ఉన్నట్లు ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. రేపు 11 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 134 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని, అలాగే ఎల్లుండి 16 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 92 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉన్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ ఎండి రోణంకి కూర్మనాథ్ తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 2 మండలాలు, శ్రీకాకుళం జిల్లాలో 8 మండలాలు, విజయనగరం జిల్లా వేపాడ మండలంలో రేపు తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉందని తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉగాది పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలకు నాందిపలకాలని విశాఖపట్నం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.మల్లిఖార్జున ఆకాంక్షించారు. ఈ రోజు వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో జిల్లా యంత్రాంగం నిర్వహించిన శ్రీ క్రోధి నామసంవత్సర ఉగాది వేడుకల్లో మహా విశాఖ నగర పాలక సంస్థ కమిషనర్ సాయికాంత్ వర్మతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. పండితులు పంచాంగ పఠనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, షడ్రుచుల మేళవింపుతో ఉగాది పచ్చడి వున్న విధంగా జీవితంలో ఎదురయ్యే అనేక సవాళ్ళను సాదరంగా స్వీకరించాలని పేర్కొంటూ....

(వాయిస్ 40 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్‌కు 'జెడ్' కేటగిరి కింద వీఐపీ భద్రత కల్పించింది. దీంతో సాయుధ కమాండో దళాలు ఆయనకు పూర్తి రక్షణ కల్పించనున్నాయి. ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ క్రమంలో సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్‌కు చెందిన 40 నుంచి 45 మంది సిబ్బంది సీఈసీ రక్షణ విధుల్లో ఉంటారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా రేపటి నుండి ఆయా నియోజకవర్గాలలో ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులకు నిర్వహిస్తున్నామని శ్రీ సత్యసాయి జిల్లా విద్యా శాఖ అధికారి మీనాక్షి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల విధులకు ఎంపిక చేసిన ఉపాధ్యాయులంతా శిక్షణా తరగతులకు తప్పకుండా హాజరు కావాలని, లేని పక్షంలో వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీ క్రోధి నామ తెలుగు సంవత్సరం కోనసీమ జిల్లా వాసుల అందరి జీవితాల్లో సుఖశాంతులు వెలుగులు నింపాలని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. స్థానిక కలెక్టరేట్ లో శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను ప్రభుత్వ పరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సనాతన సంస్కృతి ఎంతో గొప్పదని, పంచాంగం మనల్ని వేలు పట్టుకుని నడిపించే దిక్సూచి అని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విశాఖ ఉక్కు నగరం పరిరక్షణకు రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల వారు ముందుకు రావాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కన్వీనర్ ఆదినారాయణ పిలుపునిచ్చారు. స్టీల్ ప్లాంట్ ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఈరోజు నాటికి 1,153వ రోజుకు చేరుకున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =